క్లుప్తంగా

మహమ్మద్ ముఖీద్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: వరంగల్‌కు చెందిన మహమ్మద్ ముఖీద్‌కు రంగారెడ్డి జిల్లా హిమాయత్‌నగర్ మొయినాబాద్‌లోని చైతన్య వర్సిటీ (డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ) కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. న్యూ క్యాటలైటిక్ సిస్టమ్స్ ఫర్ సమ్ సెలెక్టివ్ సీ – సీ అండ్ సీ – హెటిరో ఆటమ్ బాండ్ ఫార్మేషన్స్ ఇన్ కెమికల్ సింథసిస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ.. మహ్మద్ ముఖీద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జగదీశ్‌కుమార్ ప్రకటించారు. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ నర్సింహస్వామి పర్యవేక్షణలో మహ్మద్ ముఖీద్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

జాన్ మార్కండేయకు డాక్టరేట్



కాజీపేట: కాజీపేట పట్టణంలోని అల్ఫా ఓమేగా చర్చి వ్యవస్థాపకుడు, కొంతకాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న బిషప్ జాన్ మార్కండేయ.. శుక్రవారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆయనకు డే స్ప్రింగ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా మార్కండేయకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ ఇండిపెండెంట్ బిజినెస్ కౌన్సిల్ అధ్యక్షుడు మార్టిన్, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌కు సన్మానం



కాజీపేట అర్బన్: టీఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అన్నమనేని జగన్మోహన్‌ను హనుమకొండ వికాస్‌నగర్‌లోని తన నివాసంలో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఈసంపెల్లి సంజీవ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్‌రెడ్డి, మడికొండ బాబు, కలకోట్ల జయరాం, పసునూరి బాబు, జిలకర స్వామి, గుండా రమేష్, మామిడాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురికి జైలుశిక్ష

పరకాల : ఇంటి హద్దులను తొలగించి స్థల ఆక్రమణతోపాటు గోడను కూల్చివేసిన కేసులో ఐదుగురికి పరకాల జూనియర్ సివిల్ జడ్జి శాలినిలింగం జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. సీఐ రవిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం సీతారాంపూర్ గ్రామానికి చెందిన మైక మొగిలయ్య, భిక్షపతి, రమేష్, సూరమ్మ, ఉమ కలిసి 2016వ సంవత్సరంలో నల్లెల్ల లింగమూర్తి ఇంటి హద్దులు తొలగించారు. ఆక్రమించుకోవడంతోపాటు ఇంటి గోడను కూల్చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సాక్షులను జూనియర్ సివిల్ జడ్జి శాలినిలింగం ఎదుట శుక్రవారం ప్రవేశపెట్టారు. నిందితులతోపాటు సాక్షులను విచారించిన జడ్జి ఐదుగురికి సంవత్సరం మూడు నెలలపాటు జైలు శిక్షతోపాటు రూ.12,500 జరిమానా విధించారు. నిందితులకు శిక్షపడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ అర్ధకుమార్, కోర్టు కానిస్టేబుల్ బాబును పోలీసు అధికారులు అభినందించారు.

రైతులను మోసం చేసిన వ్యక్తికి..

శాయంపేట : అరటి మొక్కలు తీసుకొని రైతులకు ఇవ్వకుండా మోసం చేసిన ఘటనలో నిందితుడికి నాలుగేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ పరకాల జూనియర్ సివిల్ జడ్జి శాలినిలింగం శుక్రవారం తీర్పు వెలువరించారు. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన ఆలేటి సతీష్.. కిసాన్ ఆగ్రో బయోటిక్స్ నుంచి 800 అరటి మొక్కలను శాయంపేట గ్రామానికి చెందిన ఉప్పునూతుల రామ్మూర్తి, కోల మల్లయ్యకు ఇవ్వడానికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో మల్లయ్య ఇంటికి బండి వెళ్లదని, తన ఇంటివద్ద పెట్టుకొని ఇస్తానని 800 మొక్కలను శాయంపేటకు చెందిన నల్లెల రమేష్ తీసుకున్నాడు. అయితే రైతులకు మొక్కలు ఇవ్వకుండా మోసం చేయడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో రమేష్‌పై 2017లో సతీష్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి రమేష్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈమేరకు రమేష్‌కు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్ : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల గురుకుల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈనెల 29 సాయంత్రం 4గంటల లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాల పేర్కొన్నారు.

కేయూలో ‘పేపర్’ లీక్

- బాధ్యులను గుర్తించేందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు
- రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ
- కమిటీ నివేదికపై ఉత్కంఠ



కేయూ క్యాంపస్: కేయూలో ఓ విషయానికి సంబంధించిన సమాచారం బయటకు లీకైందని, ఈక్రమంలో బాధ్యులను గుర్తించేందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సమాచారానికి సంబంధించి పేపర్ కాపీ ఫొటో బయటికి వెళ్లడంపై ఓ కమిటీ వేయడం యూనివర్సిటీ చరిత్రలో ఇదే తొలిసారి.

వివరాలు ఇలా ఉన్నాయి..

కాకతీయ యూనివర్సిటీలో వివిధ పరిపాలనా పదవులు నిర్వహించే వారిపైన, అధ్యాపకులు, ఉద్యోగులపైన ఆరోపణలు వచ్చినప్పుడు, అలాగే వర్సిటీకి చెందిన కళాశాలలు, పరీక్షల విభాగం, హాస్టళ్లలో అవకతవకలు జరిగాయని తెలిసినప్పుడు సాధారణంగా వీసీ అప్రూవల్‌తో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కమిటీలు వేస్తుంటారు. ఇది గత కొన్నేళ్లుగా సాగుతోంది. ఉద్యోగులు, అధ్యాపకుల సమస్యలపై డిమాండ్లు తలెత్తినప్పుడు కూడా వాటి పరిష్కారానికి కమిటీలు వేసిన సందర్భాలు ఉన్నాయి. ఆ తరువాత ఆయా కమిటీలు నివేదికలు ఇవ్వడమే లేదా జాప్యం చేయడమో చేస్తుంటాయి. కమిటీలు ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవడమే లేదా మందలించి వదిలేయడమో చేస్తుంటారు. ఒక్కోసారి కమిటీల నివేదికలను పట్టించుకోకుండా పక్కన పడేస్తూ ఉంటారు. కొన్నేళ్లుగా ఈ తంతు కేయూలో జరుగుతూనే ఉంది.

న్యాయవాదికి ఫీజు చెల్లింపు వివరాలు లీక్

కేయూలోని పలు అవకతవకలు, ఆరోపణలకు సంబంధించిన పలు అంశాలపై పలువురిపై వచ్చిన ఆరోపణలపై కేయూ వీసీగా ప్రొఫెసర్ తాటికొండ రమేష్ బాధ్యతలు స్వీకరించాక.. సుమారు మూడేళ్ల కాలంలో ఇప్పటివరకు అనేక కమిటీలు వేసిన విషయం విదితమే. ఆ కమిటీలు ఏమి తేల్చాయనే సంగతి అటుంచితే.. హైకోర్టులోని ఒక కేసు విషయంలో ఓ న్యాయవాదికి ఫీజు కింద యూనివర్సిటీ నుంచి చెల్లించిన డబ్బులకు సంబంధించి నోట్ అప్రూవల్ చేసిన ఫైల్‌లోని ఒక పేజీ ఫొటోరూపంలో బయటికి వెళ్లింది. అది ఏ విభాగం నుంచి ఏ ఉద్యోగి లీక్ చేశారో తెలుసుకునేందుకు ఏకంగా త్రిసభ్య కమిటీని నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఈనెల 22న ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో కేయూ సోషల్ సైన్స్ డీన్, హిస్టరీ విభాగం అధిపతి ప్రొఫెసర్ మనోహర్, కేయూ లీగల్ సెల్ డైరెక్టర్, యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస్, పరీక్షల విభాగంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలతదేవి ఉన్నారు. వీసీ తాటికొండ రమేష్ అప్రూవల్‌తో ఈ కమిటీని రిజిస్ట్రార్ మల్లారెడ్డి నియమించారని సమాచారం. సాధ్యమైనంత త్వరగా కమిటీ రిపోర్టు ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

బాధ్యులపై చర్య తీసుకుంటాం..

గోప్యంగా ఉండాల్సిన సమాచారాన్ని బయటికి వెల్లడించిన బాధ్యులను గుర్తించేందుకు త్రిసభ్య కమిటీని నియమించినట్లు కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి శుక్రవారం ధ్రువీకరించారు. నోట్ ఫైల్‌లోని వివరాలతో కూడిన పేపర్ ఫొటో బయటకు వెళ్లడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు బాధ్యులైన వారిపై నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం కింద ఏ సమాచారం అడిగినా వివరాలు ఇస్తామని, నోట్‌ఫైల్‌లో ఉండే పేపర్‌ను యధావిధిగా ఫొటోఫిక్ తీసి ఇవ్వడం అనేది సరికాదని ఆయన అన్నారు. కమిటీ నివేదికపై అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

మెట్టుగుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేస్తా



మెట్టుగుట్టపై అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, నాయకులు

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మెట్టుగుట్టపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెట్టుగుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో వర్షానికి గుట్టపైకి వెళ్లేదారి కొట్టుకుపోవడంతో రోడ్డుకు మరమ్మతులు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బైరి లింగమూర్తి, కుర్ల మోహన్, పైడిపాల రఘుచందర్, పెళ్లి కృష్ణమూర్తి, వస్కుల శ్రీనివాస్, గుర్రం అమర్‌నాథ్, కొప్పుల నవీన్, దండిగం సదానందం, కుక్కల సమ్మయ్య, నాయకులు, కార్యనిర్వాహణాధికారి కే.శేషుభారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యమే ‘సంకల్ప’ ధ్యేయం

వర్ధన్నపేట : ప్రజలను చైతన్యవంతం చేయడమే బీజేపీ విజయ సంకల్ప యాత్ర ధ్యేయమని పార్టీ అనుబంధ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. ఈనెల 29న నియోజకవర్గ కేంద్రానికి విజయ సంకల్ప యాత్ర చేరుకోనున్న నేపథ్యంలో ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్స్‌లో పార్టీ మండల అధ్యక్షుడు కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు.

హజ్ యాత్రికులకు మెరుగైన సేవలందించాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జాఫరుల్ ఆబెదీన్

న్యూశాయంపేట: పుణ్యక్షేత్రమైన మక్కానగరం హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు నిర్వాహకులు మెరుగైన సేవలు అందించాలని వరంగల్ కౌసర్ మజీద్ ఇమామ్ మౌలానా ఖాజా జాఫరుల్ ఆబెదీన్ సూచించారు. వరంగల్ మండిబజార్‌లో హజ్ యాత్రికుల సేవల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బాసిత్ తాహెర్, సిరాజ్ అహ్మద్, సాజిద్‌పాషా, ఎస్.ఎం.సయిద్, ఇస్మాయిల్ జబీ, హుసేన్ పాషా, అక్తర్‌హుసేన్, సర్వర్‌ఖాలిదీ, ముస్తఫరజా, రఫీకుర్ రహమాన్, అఫ్సర్, అబ్రార్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

కార్డియాక్ అరెస్ట్ నివారణకు సీపీఆర్



సీపీఆర్ పద్ధతిపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

కాజీపేట అర్బన్: కార్డియాక్ అరెస్ట్ నివారణకు సీపీఆర్ ఎంతగానో దోహదపడుతుందని కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ రామక తెలిపారు. నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న ఎనిమిది రోజుల ఎంఎస్ఎంఈ స్పాన్సర్స్ వర్క్‌షాప్‌లో భాగంగా అవుట్ ఆఫ్ హాస్పిటల్ కార్డియాక్ అరెస్ట్ అండ్ సర్వైవల్ అనే అంశంపై కార్డియాలజిస్ట్ శ్రీనివాస్ పాల్గొని సీపీఆర్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. తీవ్రమైన ఛాతినొప్పి, గుండె దడ, అధికంగా చెమట పట్టడం, శ్వాస సమస్యలు ఎదురైనప్పుడు, ఆకస్మికంగా కార్డియాక్ అరెస్ట్‌కు గురైనప్పుడు సీపీఆర్ పద్ధతి ద్వారా మనిషి ప్రాణాలను రక్షించవచ్చని వివరించారు. కార్యక్రమంలో నిట్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎండ.. చలి.. పొగమంచు



నిట్ వద్ద మంచు పడుతుండగా వెళ్తున్న వాహనదారులు





పగలంతా ఉక్కపోతతో కూడిన ఎండ వేడిమి.. రాత్రి వేళలో చలి.. తెల్లవారుజామున పొగమంచుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంచు కురుస్తుండడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ముందుకు సాగడం కనిపించింది. ఎటు చూసినా మంచు పొరలు కప్పిన రోడ్లే దర్శనమిచ్చాయి. పొగమంచులో వాహనాలు కష్టంగా రాకపోకలు సాగించాయి. ఉదయం 7గంటల దాకా మంచు అలాగే కురుస్తూనే ఉంది.

– కాజీపేట

మనింట్లో మూడో కన్ను

- సీసీ కెమెరాల ఏర్పాటుతో రక్షణ
- తక్కువ ధరకే అందుబాటులో కెమెరాల అమరిక
- ఆసక్తి చూపుతున్న ప్రజలు





ఇళ్ల వద్ద అమర్చిన సీసీ కెమెరాలు



ఇంటిలో ఏర్పాటు చేసిన సీసీఫుటేజీ

కాజీపేట: మధ్యతరగతి కుటుంబాలు ఎంతో శ్రమించి, రూ.లక్షలు వెచ్చించి ముచ్చటైన ఇల్లు కట్టుకుంటాయి. అలాగే మరికొందరు ఎన్నో ఆశలతో ఆర్థిక ఉన్నతికి దుకాణాలు, కార్యాలయాలు ఏర్పాటుచేసుకొని వ్యాపారం సాగిస్తుంటారు. ఇలా ఏర్పరుచుకున్న ఇళ్లు, వ్యాపార కేంద్రాల్లో దొంగతనాలు జరిగితే భారీ నష్టం వాటిల్లితే ఆ కుటుంబాలు తిరిగి కోలుకోవడం చాలా కష్టం. నేరస్తులు ఎవరో తెలుసుకునే సరికి ఏళ్లు గడిచిపోతాయి. ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఇళ్లు, వ్యాపార స్థలాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరిగా మారింది. వాటి ద్వారా దొంగలను కనిపెట్టడానికి అవకాశాలు ఎక్కువ. అయితే సీసీ కెమెరాలను ఏర్పాటుచేసే సంస్థలు, వ్యక్తులు కొంతకాలం క్రితం వరకు మహానగరాలకే పరిమితం కాగా, ఇప్పుడు ఆ సేవలు నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ లభిస్తున్నాయి. సీసీ కెమెరాల అమ్మకం దుకాణాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలానే వెలిశాయి. తక్కువ ధరలకే ప్యాకేజీల రూపంలో కెమెరాలు అమర్చుతున్నారు.

ఇళ్లను బట్టి కెమెరాలు

ఇళ్లను బట్టి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. చిన్న ఇల్లు అయితే నాలుగు, పెద్ద ఇల్లు, అపార్టుమెంట్లలో 12 నుంచి 16వరకు కెమెరాలను ఏర్పాటు చేస్తుంటారు. కెమెరాల సంఖ్యను బట్టి స్టోరేజీ కోసం డీవీఆర్‌లో హార్డ్‌డిస్క్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ హార్డ్ డిస్క్‌లో ఉన్న స్టోరేజీ ఫుల్ అయితే నిర్దేశిత వ్యవధి తర్వాత రోజు వారీగా హార్డ్‌డిస్క్ దానికదే స్టోరేజ్‌ను డిలీట్ చేసుకుంటూ పోతుంది. సీసీ కెమెరాల ఫుటేజ్‌ను 24గంటలూ తమ ఇళ్లల్లో టీవీల్లో చూసే అవకాశమూ ఉంటుంది. అలాగే సెల్‌ఫోన్లలోనూ చూసుకునే టెక్నాలజీ ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఎన్ని కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే అన్ని క్లిప్పింగ్‌లను చూడొచ్చు. అలాగే తమకు అవసరమైన క్లిప్పింగ్ కూడా చూడొచ్చు. వాటిని డీవీడీలు, పెన్‌డ్రైవ్‌లలో లోడ్ చేసుకోవచ్చు. మార్కెట్‌లో పోటీ కారణంగా క్వాలిటీని బట్టి ధరలు ఉన్నాయి. రూ.10 వేల నుంచి మన అవసరాన్ని బట్టి రూ.లక్ష వరకు ఖర్చు చేసేవారున్నారు.

కెమెరాలు చూస్తేనే వెనుదిరుగుతున్న దొంగలు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, దుకాణాల్లో దొంగతనాల సంఖ్య తగ్గుతున్నట్లు సమాచారం. దొంగతనానికి వచ్చిన వారు ముందుగా కెమెరాలు ఉన్నాయో.. లేవో.. గమనిస్తున్నారు. కెమెరాలు ఉంటే వెనుదిరుగుతున్నారు. ఒకవేళ సాహసించి దొంగతనానికి పాల్పడినా సీసీటీవీ ఫుటేజీ ద్వారా వారిని పట్టుకోవడం పోలీసులకు సులభం అవుతోంది.

ప్రోత్సహిస్తున్న పోలీసులు

అపార్ట్‌మెంట్లు, కాలనీలు, ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసు శాఖ కృషి చేస్తోంది. సీపీ ఆదేశం మేరకు పట్టణంలో అనేక ప్రాంతాల్లో కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేయించారు. భవిష్యత్తులో కెమెరాలు పెరగడమేగాక డేగ కన్నులతో నేరస్తుల ఆట కట్టించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి.

సీసీ కెమెరాల అవసరం ఎంతగానో ఉంది



నేడు మారిన పరిస్థితుల దృష్ట్యా ప్రతీ ఇంటిలో, దుకాణాల్లో, కాలనీల్లో సామూహికంగా లేదా వ్యక్తిగతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవశ్యకత పెరిగింది. ఇంటికి, దుకాణానికి భద్రత ఉండాలంటే సీసీ కెమెరాలు ఉండి తీరాల్సిందే. వాటివల్ల ఎలాంటి దొంగల బెడద ఉండదు.

– వెరైటీ సోమేశ్వర్‌రావు, కాజీపేట

తల్లులకు భక్తజనం మొక్కులు





అమ్మవారిపేటలో సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటున్న భక్తులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం అమ్మవారిపేటలోని మినీ మేడారాన్ని తలపించే జాతర ప్రాంగణం శుక్రవారం సమ్మక్క, సారలమ్మ నామస్మరణలో మారుమోగింది. గద్దెలపై వనదేవతలు కొలువుదీరగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మేకలు, గొర్రెలు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించారు. సమ్మక్క, సారలమ్మలు శనివారం తిరిగి వనంలోకి వెళ్లడంతో జాతర ముగుస్తుంది.

భక్తిశ్రద్ధలతో ‘పెద్దల పండుగ’



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: ఈనెల 25న అత్యంత పవిత్రంగా జరుపుకునే షబేబరాత్ (పెద్దల) పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో దర్శించుకోవాలని వరంగల్ ఫోర్ట్ రోడ్డు జానుల్లా షహీద్ కబ్రస్థాన్, ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ కోరారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని జానుల్లా షహీద్ కబ్రస్థాన్‌లో బల్దియా అధికారుల ఆధ్వర్యంలో జానుల్లా షహీద్, ఈద్గా కమిటీ నేతృత్వంలో పారిశుద్ధ్య పనుల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సహకారంతో ముస్లింలు సమాధులను రాత్రి సమయాల్లో దర్శించుకునేలా విద్యుత్‌దీపాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కబ్రస్థాన్లలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేసినట్లు జబ్బార్ తెలిపారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎండీ.చాంద్‌పాషా, ఎండీ.అశ్రఫ్, హసన్ హలీబేగ్, సాదిక్, షఫీ, యాకూబ్, సంజరీ, మోహిస్ తదితరులు పాల్గొన్నారు.

దర్గా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



సూచనలు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లయ్య

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో ఈనెల 25, 26వ తేదీల్లో జరగనున్న హజ్రత్ సేద్నా అబ్దుల్లా షా షాహిద్ రహిమతుల్లా అలీ దర్గా సందల్ ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలతో కలిసి ఉత్సవాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో దర్గా సందల్ ఉత్సవాలు జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకన్న, ఎండీ.ఫసీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిలో అధ్యయనం

గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గంగదేవిపల్లిని ఏపీలోని సత్యసాయి జిల్లా నంబూల పూలకుంట మండలంలోని 12 గ్రామాలకు చెందిన 25 మంది గ్రామ స్థాయి నాయకులు శుక్రవారం సందర్శించి అధ్యయనం చేశారు.